## సౌత్ జోన్‌కు జిల్లా నుంచి ఎంపిక



సౌత్ జోన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి, జూలై 13 : కేరళలో రాష్ట్రంలోని కొల్లాంలో ఈ నెల 19 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఇండియా సబ్ జూనియర్ సౌత్ జోన్ చాంపియన్ షిప్-2024 పోటీలకు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో కామారెడ్డి జిల్లా నుంచి మెన్స్ విభాగంలో దినేశ్, తులసీకుమార్, ఉమెన్స్ విభాగంలో వీణ, భవానీ ఎంపికయ్యారు. వీరికి హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం లింగం శనివారం అభినందించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ట్రెజరర్ మధుసూదన్ రెడ్డి, కోచ్ ఆంజనేయులు, అజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి నర్సింహులు, సంఘం సభ్యులు

దోమకొండ, జూలై 13 : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, సంఘం సభ్యులు కలిసి వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మార్చాలని కోరారు. జీవో నంబర్ 15ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు రాజేందర్, సీతారాం మధు, రాజు, ఆంజనేయులు, చిన్న రాజయ్య, రాములు, రాజయ్య, శ్రీనివాస్, సురేశ్, స్వామి, రవీందర్ పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన నాయకులు

మాచారెడ్డి, జూలై 13 : మాచారెడ్డి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అలీఖాన్, బన్సీలాల్, శ్రీరాం, బ్రహ్మం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో వేధిస్తున్న అధ్యాపకుల కొరత

- అధ్యాపకులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



బీబీపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

బీబీపేట్, జూలై 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీబీపేటను నూతన మండలంగా ఏర్పాటు చేసి జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. బాలుర ఉన్నత పాఠశాలలో మూడు గదులు తీసుకొని కళాశాలను ప్రారంభించారు. దోమకొండ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ కళాశాల బాధ్యతలను అప్పగించారు. గతేడాది జూలై 8వ తేదీన ఏర్పడిన జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో 45 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. అధ్యాపకులు లేకపోవడంతో దాత సహకారంతో నలుగురు ప్రైవేట్ లెక్చరర్లను నియమించారు. కళాశాలకు మొత్తం 12 మంది లెక్చరర్లు కావాల్సి ఉంది. కానీ.. నలుగురు ప్రైవేట్ లెక్చరర్లతో 45 మంది విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు బోధించడంతో విద్యార్థులు శ్రద్ధ పెట్టకపోవడంతో 45 మందిలో ఒక్కరూ కూడా పాస్ కాలేదు.

**పూర్తిస్థాయి లెక్చరర్లను నియమించాలి**

ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని కళాశాలలో పూర్తిస్థాయి లెక్చరర్లను నియమించి కళాశాలను కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాశాల సాధన సమితి సభ్యులు, నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు. లెక్చరర్లు లేకపోవడంతో కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడానికి ముందుకు రాలేకపోతున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చొరవ తీసుకొని కళాశాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం



ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం. పాఠాలు బోధించేందుకు లెక్చరర్లు అవసరమని పైఅధికారులకు నివేదిక అందించాం. లెక్చరర్లు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థుల కోసం పుస్తకాలు కూడా కళాశాలకు చేరాయి.

**- షేక్ సలామ్, ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి**

## పోచారం ప్రధాన కాలువలో చెట్లు, గడ్డి తొలగింపు



రామక్కపల్లి శివారులోని కాలువలో పెరిగిన తుమ్మ చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట, జూలై 13 : మండలంలోని పోచారం ప్రధాన కాలువలో పెరిగిన చెట్లు, ముళ్ల పొదలు, గడ్డిని తొలగిస్తున్నట్లు నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ప్రధాన కాలువలో తుమ్మ చెట్లు, గడ్డి పెరిగి నీరు దిగువకు వెళ్లడం లేదన్నారు. దీంతో నీటి పారుదల శాఖ సిబ్బందితో కాలువలో, కాలువకు ఇరుపక్కల పెరిగిన వాటిని తొగిస్తున్నామని తెలిపారు.

## డ్రైనేజీలో తాగునీటి పైపులైన్



మురికి కాలువలో ఏర్పాటు చేసిన పైపులైన్

నాగిరెడ్డిపేట, జూలై 13 : మండలంలోని వదల్‌పర్తి గ్రామంలో తాగునీటి పైపులైన్‌ను డ్రైనేజీలో నుంచి ఏర్పాటు చేశారు. దీంతో కలుషిత నీరు సరఫరా అవుతున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోని పాత గ్రామ పంచాయతీ భవనం పక్కనే కొత్తగా బోరుబావిని తవ్వించి మోటరు బిగించారు. కాలనీకి నీరు సరఫరా చేసేందుకు పైపులైన్‌ను డ్రైనేజీలో నుంచి ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి పైప్‌లైన్‌ను డ్రైనేజీలో నుంచి తొలగించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మెట్ల బావిని బాగుచేయండి సారూ..!

ఎల్లారెడ్డి, జూలై 13 : పురాతన మెట్ల బావి చెత్త చెదారంతో పూడుకుపోయిందని, దానికి బాగు చేయాలని ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామస్తులు కోరుతున్నారు. కల్యాణి గ్రామంలో ఉన్న మెట్ల బావి ఐదారు దశాబ్దాల క్రితం ఓ వెలుగు వెలిగింది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో చురుగ్గా పాల్గొనడంతోపాటు రజాకార్లకు వ్యతిరేకంగా కళ్యాణి గ్రామస్తులు పోరాటం చేశారు. కాలక్రమేణా ఎల్లారెడ్డి పట్టణం అభివృద్ధి చెందడంతో కళ్యాణి గ్రామం ప్రముఖులు, వ్యాపారులు ఎల్లారెడ్డికి వచ్చి స్థిరపడ్డారు. దీంతో ఆ గ్రామం మరుగునపడింది. ఎల్లారెడ్డిలోని రెండు మెట్ల బావులను కలెక్టర్ బాగుచేయించారని, తమ గ్రామంలోని మెట్ల బావిని కూడా బాగు చేయించాలని కళ్యాణి గ్రామస్తులు కోరుతున్నారు.



కళ్యాణి గ్రామ శివారులో మెట్ల బావి చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

## ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కామారెడ్డి, జూలై 13 : ఆటో డ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. కామారెడ్డిలోని పాత బస్టాండ్ జేపీఎన్ రోడ్‌లో శనివారం నిర్వహించిన ఆటో యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మద్యం తాగి ఆటోను నడుపొద్దని సూచించారు. ఆటో డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీను, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బ్యాంకు మేనేజర్ మృతి



చండీప్రియ

బాన్సువాడ రూరల్, జూలై 13 : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామ డీసీసీబీ మేనేజర్ చండీప్రియ(35) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కోనాపూర్‌కు చెందిన చండీప్రియను కరీనగర్ జిల్లా మంతెన గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించినట్లు తెలిపారు. మూడు ఏండ్ల క్రితం హన్మాజీపేట్ డీసీసీబీ మేనేజర్‌గా ఇక్కడి వచ్చారన్నారు. మూడు నెలలుగా సెలవులో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు చెప్పారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

## దాతలకు సన్మానం

నస్రుల్లాబాద్, జూలై 13 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో శనివారం భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆలయానికి తిర్మలాపూర్ గ్రామస్తులైన రంగాపురం బాలాగౌడ్, మణెమ్మ దంపతులు రూ.15వేలు ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

భిక్కనూరు, జూలై 13 : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కూర్ల భూపాల్(46) స్థానిక ఫార్మా కంపెనీకి డ్యూటీకి వెళ్తుండగా, స్థానిక రైస్‌మిల్ మలుపు వద్ద ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొన్నది. దీంతో భూపాల్ బైక్‌పై నుంచి కింద పడగా తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, జూలై 13 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, పోలీస్ సిబ్బంది శనివారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని 28 మంది వాహనదారులకు జరిమానా విధించారు. సిబ్బంది రంజిత్‌గౌడ్, శృతి పాల్గొన్నారు.

# ఇనుప స్తంభాలు.. ప్రమాదానికి పిలుపులు

- గ్రామాల్లో ఇప్పటికీ ఇనుప స్తంభాలే
- సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం
- ప్రమాదాలు జరుగుతాయని ప్రజల ఆవేదన



బిచ్కుందలోని ఇనుప స్తంభాలు, బిల్డింగ్‌కు ఆనుకొని ఉన్న స్తంభాలు



బిచ్కుంద, జూలై 13: విద్యుత్ లైన్ల కోసం గతంలో ఇనుప స్తంభాలను ఏర్పాటుచేశారు. వాటితో ప్రమాదాలు పొంచి ఉండడంతో క్రమంగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ.. ఇప్పటికీ పలు గ్రామాల్లో ఇనుప స్తంభాలే ఉన్నాయి. వీటి ద్వారా ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలను మార్చి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఆదేశాలు ఇచ్చినా.. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో అది అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. బిచ్కుందలోని గాంధీచౌక్ నుంచి కమ్మరి గుడికి వెళ్లే ప్రధాన దారి వెంట స్తంభాలు ఇండ్లకు ఆనుకొని ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వానకాలం ప్రారంభం కావడంతో ఇనుప స్తంభాలను విద్యుత్ సరఫరా అవుతుందని ఆవేదన చెందుతున్నారు. మూగజీవాలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నదని భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### నిధుల కొరతతో మార్చలేకపోయాం..

గతంలో ఇనుప స్తంభాలు ఉన్న చాలా ప్రదేశాల్లో వాటిని మార్చి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశాం. నిధుల కొరతతో కొన్ని స్తంభాలను మార్చలేకపోయాం. త్వరలో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇనుప స్తంభాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరుగకుండా చూస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి శిథిలావస్థలో ఉన్న సిమెంట్ స్తంభాలను కూడా తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం.

**- కామేశ్వర్‌రావు, ట్రాన్స్‌కో డీఈఈ**

# జోరుగా వన మహోత్సవం



లింగంపేటలో మొక్కలు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్



వెల్లుట్లపేట చెరువుకట్టపై మొక్కలు నాటుతున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

ఎల్లారెడ్డి రూరల్/ లింగంపేట, జూలై 13: జిల్లా వ్యాప్తంగా 75వ వన మహోత్సవం జోరుగా సాగుతున్నది. గ్రామాల్లో అధికారులు ప్రజలతో కలిసి మొక్కలను నాటుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట చెరువు కట్టపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 300 మొక్కలను నాటారు. ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, గీత కార్మికులు విఠల్‌గౌడ్, రాజాగౌడ్, సాయాగౌడ్, దేవేందర్ గౌడ్, రాజేందర్ గౌడ్, బాల్‌కిషన్ గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. లింగంపేటలో మొక్కలను పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో ఉసిరి, తులసి, జామ, గులాబీ, నిమ్మ, బొప్పాయి, దానిమ్మ తదితర మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు.

## 'రోడ్డు కబ్జాను అడ్డుకోవాలి'

ఎల్లారెడ్డి, జూలై 13: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో రోడ్డును కబ్జా చేసి నిర్మాణ పనులు చేపడుతున్నారని, అధికారులు అడ్డుకోవాలని గ్రామానికి చెందిన ఆశమొల్ల సాయిబాబా శనివారం కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దడ్ల నర్సింహులు గ్రామంలోని రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు దారిలేకుండా పోతుందని తెలిపారు. గతంలో అతడు నిర్మాణం చేపట్టగా.. తాను అడ్డుకున్నానని, ప్రస్తుతం తిరిగి పనులు చేపడుతున్నాడని అన్నారు. ఈ విషయమై మాజీ వైస్ ఎంపీపీ నర్సింహులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అనుమతితోనే తాను నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ కక్షలతోనే తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.



యువకులను సన్మానిస్తున్న లబాన్ సమాజ్ బాధ్యులు

## ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

గాంధారి, జూలై 13: ఇటీవల ప్రకటించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించిన మధుర లంబాడి యువకులను లబాన్ సమాజ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని లక్ష్మమ్మ ఆలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన బర్దావత్ మేగరాజ్, 17వ ర్యాంక్ సాధించిన బస్సి గోపాల్, నీట్ ర్యాంక్ సాధించిన మంజ రంజిత్‌కు శాలువాలు కప్పి సత్కరించారు. లబాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ మాట్లాడుతూ.. లబాన్(మధుర) యువత చదువులో రాణించడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ చందానాయక్, జగదీశ్ నాయక్, దర్బార్ నాయక్, చతుర్‌సింగ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి

ఎల్లారెడ్డి, జూలై 13: ఎల్లారెడ్డికి చెందిన పలువురు నాయకులు శనివారం హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిశారు. తమ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భిక్కనూర్ గ్రామ నాయకుడు సంజీవ్ రెడ్డి, వెల్లుట్ల బాలకిషన్, ఎల్లారెడ్డి పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో ఎల్లారెడ్డి మండల నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, ABDUL SHAHNAZ W/o. ABDUL MAJEED R/o.H.No.3-19/A, Vill: Nallur, Mdl: Mupkal, Dist. Nizamabad T.G. Changed my Surname / Name as SHAHANAZ BEGUM W/o. ABDUL MAJEED
NTZ-340177

**ప్లాట్స్ అమ్మబడును**

★నిజామాబాద్ మారుతినగర్ వెనుక, న్యూ హౌసింగ్ బోర్డ్ ఎదురుగా, లే అవుట్ ఈస్ట్ ఫేస్ 312 గజాలు మరియు వెస్ట్ ఫేస్ 306 గజాల గల 2 ప్లాట్లు అమ్మబడును. సెల్: 94937 11066
NTZ-340178

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-

**TOURS & TRAVELS**



★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## పంటల వివరాలను నమోదు చేసుకోవాలి



బేగంపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న పెద్దకొడప్‌గల్ మండల వ్యవసాధికారి నదీముద్దీన్

పెద్దకొడప్‌గల్, జూలై 13: రైతులు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నదీముద్దీన్ అన్నారు. మండలంలోని బేగంపూర్ గ్రామంలో రైతులు సాగుచేస్తున్న సోయా పంటను ఆయన శనివారం పరిశీలించారు. పంట సాగులో సందేహాలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై ఆవులు

ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు



లింగంపేటలోని కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఆవులు

లింగంపేట, జూలై 13: లింగంపేటలోని ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో ఆవులు సంచరిస్తున్నాయి. ఆవుల సంచారంతో ప్రమాదాలు జరిగినా.. వాటి యజమానులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలోని కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై తహసీల్ కార్యాలయం వరకు పదుల సంఖ్యలో ఆవులు కూర్చుంటున్నాయి. వాహనాలు వచ్చిన సమయంలో కూడా తప్పుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రాత్రి 11 గంటల ప్రాంతంలో రహదారిపై కూర్చున్న ఆవులు కనిపించకపోవడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన మనోహర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రధాన రహదారిపై ఆవులు కూర్చోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

లింగంపేట, జూలై 13: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. లింగంపేటలో ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. మండల వైద్యాధికారి హిమబిందు, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు వీరమణి, రేణుక, సావిత్రి, చంద్రకళ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం ప్రత్యేక పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పెద్ద కొడప్‌గల్, జూలై 13: వరుణుడు కరుణించాలని కోరుతూ మండలంలోని బేగంపూర్ గ్రామస్తులు శనివారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు శ్రీపత్ ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. భజనలు నిర్వహించిన అనంతరం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటుచేశారు.